క్లుప్తంగా

ఆర్థిక సహాయం



బాధితుడు విజయ్‌కు నగదు అందజేస్తున్న జైభీమ్ యూత్ సభ్యులు

వేపాడ: మండల కేంద్రానికి చెందిన గ్రామ వలంటీర్ రెడ్డి విజయ్ గుండె సంబంధిత సమస్యతో బాధపడుతుండటంతో గ్రామానికి చెందిన జై భీమ్ యూత్ సభ్యులు వైద్య ఖర్చుల నిమిత్తం గురువారం ఆర్థిక సహాయం చేశారు. బాధితుడు విజయ్‌కు గుండె ఆపరేషన్ చేయించాల్సి ఉందని తెలిసి తమవంతు సహాయంగా రూ.10,500 అందజేశామని జైభీమ్ యూత్ సభ్యులు తెలిపారు.

నేటి నుంచి సమ్మర్ క్రాస్ ప్రోగ్రాం

లక్కవరపుకోట: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా మండల వ్యాప్తంగా శుక్రవారం నుంచి సమ్మర్ క్రాస్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కె.రూపేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 31 పంచాయతీల్లో చేతి పంపు బోర్లు, డైరెక్ట్ పంపింగ్ సిస్టమ్స్, రక్షిత మంచినీటి పథకాలకు మరమ్మతులు చేపట్టనున్నట్లు వివరించారు. ఇప్పటికే రూ.4.50 లక్షల విలువైన సామగ్రిని కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ పనులను మే నెల 9వ తేదీ వరకు కొనసాగిస్తామని పేర్కొన్నారు.

30న ఉరుసు ఉత్సవం

చీపురుపల్లి: స్థానిక రుంకానవీధిలోని దత్త సాయి మందిరంలో ఈనెల 30న ఉరుసు ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు మందిర నిర్వాహకులు తంగుడు రామకృష్ణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 4 గంటల నుంచి రాత్రి వరకు మందిరంలో ప్రత్యేక పూజలు ఉంటాయని పేర్కొన్నారు. ఉదయం 7.30 గంటల నుంచి శ్రీ సీతారామ కల్యాణం, మధ్యాహ్నం 12.30 గంటలకు అఖండ అన్న సమారాధన ఉంటుందని తెలిపారు. 3 గంటలకు చందనోత్సవం కార్యక్రమంలో భాగంగా ముస్లింలతో ఉరుసు ఉత్సవాన్ని సంప్రదాయ పద్ధతిలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి

బొండపల్లి: మండలంలోని జగనన్న లేఅవుట్లతో పాటు, సొంత స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేయాలని హౌ సింగ్ ఏఈఈ రమణమూర్తిరాజు గురువారం ఓ ప్రకటనలో సూచించారు. జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలకు కావాల్సిన అన్ని సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తోందని, ఉచితంగా ఇసుక, రాయితీపై సిమెంట్ అందిస్తున్నామని తెలిపారు. నిర్మాణాలకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో లేవని వివరించారు. నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సచివాలయ ఇంజినీరింగ్ సహాయకులకు సూచించారు.

గ్రామాల్లో 'ఫ్యామిలీ డాక్టర్'

బొండపల్లి: మండలంలోని రోళ్లవాక, కెరటాం గ్రామాల్లో బొండపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎల్.సత్యనారాయణ, ఆర్.అమృతవల్లి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ముందుగా వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి ఓపీ (అవుట్ పేషెంట్) సేవలు అందించారు. 60 మందికి వివిధ వైద్యపరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం గృహ సందర్శన చేసి ప్రజలకు వైద్య తనిఖీలు చేశారు.

కొత్తవలస తహసీల్దార్‌గా హేమంత్‌కుమార్



హేమంత్‌కుమార్

కొత్తవలస: మండల తహసీల్దార్‌గా జి.హేమంత్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ డి.ప్రసాదరావు రెండు నెలల పాటు సెలవుపై వెళ్లడంతో జామి తహసీల్దార్‌గా పనిచేస్తున్న హేమంత్ కుమార్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పజెప్పినట్లు జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం కార్యాలయంలో సిబ్బందితో హేమంత్‌కుమార్ సమావేశం నిర్వహించారు.

వ్యాసరచనలో మెలకువలు అవసరం

శృంగవరపుకోట:

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో 'వ్యాసరచన మెలకువలు' అన్న అంశంపై జాతీయ అంతర్జాల సదస్సును గురువారం నిర్వహించారు. సదస్సులో ఉస్మానియా తెలుగు విభాగం ఆచార్యులు వి.నిత్యానందరావు విద్యార్థులకు వ్యాసరచన పద్ధతులు, వ్యాసాల రకాలను వివరించారు. వ్యాసరచన ఎత్తుగడ, శీర్షిక పేరు, వినూత్న అంశం, కొత్తచూపు, స్పష్టత ముఖ్యమన్నారు. వ్యాసాల్లో చారిత్రక, ఆధ్యాత్మిక, సాహిత్య, భాషా వ్యాసాలు ఇలా పలు రకాలుగా ఉంటాయన్నారు. తెలుగుశాఖ అధ్యక్షురాలు ఆర్.శీలక్ష్మి మాట్లాడుతూ నిత్యానందరావు రచించిన 'విశ్వవిద్యాలయాల్లో తెలుగు పరిశోధన' పుస్తకం పరిశోధకులకు కరదీపిక వంటిదన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రమేష్‌కుమార్, సి.వి.ఎస్.రవీంద్రనాథ్, వాసు దేవరావు, ఈరన్న, భాస్కరరావు, శ్రీనివాసరావు, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య విప్లవవీరులకు ఘన నివాళి

- భగత్‌సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్‌లను స్ఫూర్తిగా తీసుకోవాలి



చీపురుపల్లి: వంగపల్లిపేట ప్రాథమిక పాఠశాలలో మౌనం పాటిస్తున్న ఉపాధ్యాయుడు, విద్యార్థులు



గజపతినగరం: భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీఐటీయూ నాయకులు



కొత్తవలస: భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు



చీపురుపల్లిరూరల్(గరివిడి): భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



శృంగవరపుకోట: భగత్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న కార్మిక సంఘాల నేతలు



వేపాడ: కొండగంగుబూడిలో భగత్‌సింగ్ చిత్రపటంతో నినాదాలు చేస్తున్న రైతు సంఘం నాయకులు, వేతనదారులు

శృంగవరపుకోట: భారతదేశ స్వాతంత్ర్యకోసం బ్రిటిష్ వారితో పోరాటం చేసి చిన్న వయస్సులోనే ప్రాణాలను తృణప్రాయంగా వదిలిన భగత్‌సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్‌లను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మద్దిల రమణ అన్నారు. భగత్‌సింగ్, రాజగురు, సుఖ్ దేవ్‌ల వర్ధంతిని సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నేతృత్వంలో పట్టణంలో గురువారం నిర్వహించారు. ఆయా సంఘాల నాయకులు భగత్‌సింగ్, రాజగురు, సుఖ్‌దేవ్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మద్దిల రమణ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ దేశాన్ని దోచేసి, కార్పొరేట్ శక్తులకు కేక్‌లు పంచినట్టు పంచుతోందని ఆరోపించారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ దేశ ప్రజల మధ్య వైరుధ్యాలు, వైషమ్యాలు సృష్టించి, సామాన్య మధ్య తరగతి వర్గాల వారికి ఉద్యోగ, ఉపాధి మార్గాలు లేకుండా చేస్తున్నాయని, ఈస్టిండియా కంపెనీలా వ్యవహరిస్తూ మరోమారు భారతజాతిని బానిసజాతిగా మారుస్తున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో చినబాబు,సీహెచ్.ముత్యాలు, ఉపాధి హామీ కార్మికులు పాల్గొన్నారు.

త్యాగమూర్తుల కోసం తెలుసుకోవాలి

చీపురుపల్లి: భారతదేశం స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన త్యాగమూర్తులు, దేశం కోసం పని చేసిన వారి గురించి విద్యార్థులు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని ఉపాధ్యాయుడు ఎస్.బలరాం అన్నారు. పట్టణంలోని వంగపల్లిపేట ప్రాథమిక పాఠశాలలో అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. స్వాతంత్ర్యం కోసం ఉరికంబానికి ఎక్కిన భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్యం కోసం భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌లు చేసిన కృషిని విద్యార్థులకు ఉపాధ్యాయుడు వివరించారు.

భగత్‌సింగ్‌ను స్మరించుకోవాలి

చీపురుపల్లిరూరల్(గరివిడి): స్వాతంత్ర్య పోరాట యోధుడు భగత్‌సింగ్‌ను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని సీఐటీయూ నాయకులు అన్నారు. గరివిడి సీఐటీయూ కార్యాల యంలో భగత్‌సింగ్ వర్ధంతిని గురువారం నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం అతి చిన్న వయస్సులో ప్రాణాలర్పించిన భగత్‌సింగ్ స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై యువత పోరా డాలన్నారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు పి.వి.రమణ, జిల్లా ఉపాధ్యక్షుడు అంబల్ల గౌరినాయుడు, మండల అధ్యక్షుడు విశ్వనాథరాజు తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరంలో..

గజపతినగరం: స్థానిక పంచాయతీ కార్యాలయంలో భగత్‌సింగ్ వర్ధంతిని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటం వద్ద సీఐటీ యూ నాయకులు నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మి మాట్లాడుతూ బీజేపీ పాలనతో ప్రజలంతా ఇబ్బందులు పడుతున్నారని, బీజేపీ నుంచి దేశాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. భగత్‌సింగ్ వంటి దేశభక్తుల జీవిత చరిత్రను కర్ణాటకలో అక్కడి బీజేపీ ప్రభుత్వం పాఠ్య పుస్తకాల నుంచి తొలగించడం సిగ్గుచేటని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కృష్ణ, గోవింద, భాస్కరరావు, లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘం ఆధ్వర్యంలో..

వేపాడ: మండలంలోని కొండగంగుబూడి గ్రామంలో గురువారం భగత్‌సింగ్ వర్ధంతిని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ నేతృత్వంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చల్లా జగన్ మాట్లాడుతూ బ్రిటిష్ వాళ్లను తరిమికొట్టేందుకు నాడు భగత్ సింగ్, రాజ్ గురు సుఖదేవ్‌లు చేసిన పోరాటస్ఫూర్తిని నింపారన్నారు. కార్యక్రమంలో పలువురు కార్మికులు, ఉపాధివేతనదారులు పాల్గొన్నారు.

దెందేరు గ్రామంలో..

కొత్తవలస: మండలంలోని దెందేరు గ్రామంలో భగత్‌సింగ్ వర్ధంతిని సీఐటీయూ నాయకులు గాడి అప్పారావు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ముఠా కార్మికులు, ఆటోడ్రైవర్లతో కలిసి భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గిరిజన గ్రామాల్లో వైద్యశిబిరాలు



కోటయ్యగరువులో వైద్యసేవలందిస్తున్న డాక్టర్ సతీష్‌కుమార్

వేపాడ: మండలంలోని బొద్దాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కొండగంగుబూడి పంచాయతీలోని కోటయ్యగరువు, బడ్డీ చింతల గిరిజన గ్రామాల్లో వైద్యాధికారి సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం వైద్యశిబిరాలు నిర్వహించారు. 80 మందికి వైద్యపరీక్షలు చేసి, అయిదుగురు జ్వరాలతో బాధపడుతున్నట్లు గుర్తించి, ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం గ్రామాల్లో దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. పరిసరాల పరిశుభ్రత పాటిస్తే చాలా వరకు వ్యాధులు దరిచేరవన్నారు. క్షయవ్యాధిపై అవగాహన కల్పించారు. హెల్త్ సూపర్‌వైజర్ పి.ఎస్.ఆర్.మూర్తి, ఆరోగ్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న వైద్యసిబ్బంది

గజపతినగరం రూరల్: సకాలంలో పశువులకు టీకా వేయడంతో గాలికుంటవ్యాధి శతశాతం నయమయ్యే అవకాశం ఉంటుందని తుమ్మికాపల్లి పశువైద్యులు శశిభూషణరావు అన్నారు. మండలంలోని కాలంరాజుపేట గ్రామంలో పశువులకు గురువారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ఈనెల 1 నుంచి ఇప్పటి వరకు 950 పశువులకు టీకాలు వేశామని చెప్పారు. నెలాఖరుకు 2,000 పశువులకు టీకాలు వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. గ్రామ సర్పంచ్ గేదెల ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు సీతారామస్వామి ఆలయ ప్రతిష్ఠ

గంట్యాడ: మండలంలోని పెదవేమలి గ్రామంలో సీతారామస్వామి ఆలయ ప్రతిష్ఠ శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు గురువారం తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



గనిశెట్టిపాలెంలో మహిళలకు అవగాహన కల్పిస్తున్న సబల సంస్థ ప్రతినిధులు

కొత్తవలస/లక్కవరపుకోట: సబల సంస్థ ఆధ్వర్యంలో కొత్తవలస మండలం దెందేరు క్లస్టర్ పరిధి గనిశెట్టిపాలెం, లక్కవరపుకోట మండలంలోని మార్లాపల్లి గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంపై మహిళలకు గురువారం అవగాహన కల్పించారు. సబల సంస్థ ప్రతినిధులు కె.ఈశ్వరరావు, బి.గోవిందరావు చిరుధాన్యాల సాగు, విత్తన ఎంపిక, సేంద్రియ ఎరువులు, కషాయాల తయారీని వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవధాన్యాల సాగు ద్వారా భూమిలో జీవ వైవిధ్యం ఏర్పడుతుందన్నారు. తద్వారా భూమిలో నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందని, వానపాముల సంఖ్య గణనీయంగా పెరగడంతో పంటలకు కావాల్సిన పోషకాలు విరివిగా లభిస్తాయన్నారు. సబల ప్రతినిధులు కోటిబాబు, బి.శ్యామల, దావాల లక్ష్మి పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల సందర్శన



హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లో సేవలపై ఆరాతీస్తున్న ప్రత్యేక అధికారి రామ్‌గోపాల్

జామి: మండలంలోని అట్టాడ గ్రామంలో మండల ప్రత్యేక అధికారి రామ్‌గోపాల్ గురువారం పర్యటించారు. గ్రామంలోని సచివాలయాన్ని,హెల్త్ వెల్‌నెస్ సెంటర్, రైతు భరోసా కేంద్రం, ప్రాథమిక పాఠశాల.అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఆయా కార్యాలయాల్లో రికార్డులను పరిశీలించడంతో పాటు అందిస్తున్న సేవలపై సిబ్బందిని ఆరా తీశారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం వంటలను రుచి చూశారు. కార్యలయాల్లో అందిస్తున్న సేవలు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జామి పీహెచ్‌సీ వైద్యాధికారి భాగ్యరేఖ, స్థానిక సర్పంచ్ అమ్మన్నదొర తదితరులు ఉన్నారు.

సామూహిక సీమంతాలు



గర్భిణులకు సీమంతం చేస్తున్న సీడీపీఓ ఉమాదేవి

లక్కవరపుకోట: స్థానిక అంగన్‌వాడీ కేంద్రం–2లో వియ్యంపేట ఐసీడీఎస్ పీఓ రొంగళి ఉమాదేవి ఆధ్వర్యంలో పోషణ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు గురువారం సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈసందర్భంగా పీఓ మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు విధిగా తీసుకోవడం వల్ల రక్తహీనత సమస్య తలెత్తదని చెప్పారు. గర్భిణులు ఎలాంటి ఒత్తిడి, మానసిక ఆందోళనలకు లోనవకూడదని వివరించారు. కార్యక్రమంలో సహాయ సీడీపీఓ లక్ష్మీబాయి, సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు,సహాయకులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి



హెల్త్ సబ్‌సెంటర్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ రమణకుమారి

గంట్యాడ: ప్రజలకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎస్.వి.రమణకుమారి సూచించారు. నరవ గ్రామంలోని ఆరోగ్య ఉపకేంద్రాన్ని గురువారం ఆమె సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. కేంద్రానికి రోజుకు ఎంత మంది రోగులు వస్తున్నారు, ఏయే వైద్య సేవలు అందిస్తున్నారని వైద్య సిబ్బందిని ఆరా తీశారు. అనంతరం స్థానిక పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి ఆరోగ్య సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగితెలుసుకున్నారు. చేతుల శుభ్రత పాటించడం వల్ల చాలా వరకు వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. చిన్నారులకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించాలని అంగన్‌వాడీ కార్యకర్తకు సూచించారు. డీఎంహెచ్ఓ వెంట పీహెచ్‌సీ వైద్యాధికారి శీతల్‌వర్మ, స్వామి తదితరులు ఉన్నారు.

కూలిన విద్యుత్ స్తంభాలు



వి.కృష్ణాపురంలో కూలిన విద్యుత్ స్తంభం

దత్తిరాజేరు: మండలంలోని షికారుగంజి, వి.కృష్ణాపురం, భోజరాజపురం గ్రామాల్లో గురువారం కురిసిన భారీ వర్షానికి విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. దీంతో ఆయా గ్రామాల్లో కొన్ని వీధులకు విద్యుత్ సరఫరాను అధికారులు నిలిపివేశారు. శుక్రవారం విద్యుత్ స్తంభాలను సరిచేసి సరఫరా పునరుద్ధరిస్తామని విద్యుత్ శాఖ ఏఈ ఆదిత్య తెలిపారు.

సాగు పట్టాలిచ్చి ఆదుకోండి



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నేతలు, దళిత రైతులు

చీపురుపల్లి: తలగాం గ్రామానికి చెందిన దళిత రైతులకు సాగు పట్టాలు ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సీతారాం కోరారు. రాజాం నియోజకవర్గంలోని వంగర మండలం తలగాం గ్రామానికి చెందిన పలువురు రైతులతో కలిసి స్థానిక ఆర్డీఓ కార్యాలయం వద్ద గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తలగాం గ్రామ రెవెన్యూ పరిధిలో 16.73 ఎకరాల భూమలను ఆ గ్రామానికి చెందిన దళితులు సాగు చేసుకునే వారని చెప్పారు. అయితే అక్కడి దళితులు పొట్టకూటి కోసం కొంతకాలం క్రితం వలస వెళ్లారని, వారు తిరిగొచ్చే సరికి ఆ భూములను ఇతరులకు పట్టాలు రూపంలో రెవెన్యూ అధికారులు కట్టబెట్టారని ఆరోపించారు. అధికారులు మరోసారి పరిశీలన చేసి అనర్హులకు కేటాయించిన పట్టాలు రద్దు చేసి గతంలో సాగు చేసుకునే దళితులకు కట్టబెట్టాలని కోరారు. అనంతరం ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. సీఐటీయూ డివిజన్ కార్యదర్శి అంబల్ల గౌరునాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేలకొరిగిన మొక్కజొన్న



దెబ్బతిన్న మొక్కజొన్న పంట

దత్తిరాజేరు: మండలంలోని దత్తి గ్రామంలో గురువారం కురిసిన భారీ వర్షానికి సుమారు పది ఎకరాల్లో మొక్కజొన్న పంట నేలకొరిగి, నీట మునిగింది. మరికొద్ది రోజుల్లో కోత దశకు చేరుకోనున్న పంట ఇలా దెబ్బతినడంతో తమ కష్టం నేలపాలైందని రైతులు నారాయణ, పైడిపునాయుడు, అప్పలనాయుడు, రెడ్డి త్రినాథ్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటను శుక్రవారం పరిశీలించి నష్టాన్ని అంచనా వేస్తామని వ్యవసాయ సిబ్బంది తెలిపారు.

అలరించిన నృత్య ప్రదర్శన

గజపతినగరం:

ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ఆల్తివారి కల్యాణ మండపంలో స్థానిక అభినయ ఆర్ట్స్‌కు చెందిన కూచిపూడి నృత్య కళాకారులతో బుధవారం రాత్రి నిర్వహించిన నృత్య ప్రదర్శన ఆహుతులను అలరించింది. అభినయ ఆర్ట్స్ వ్యవస్థాపకులు మాస్టర్ ప్రభాకర్ శర్మ ఆధ్వర్యంలో హర్షవర్ధన స్కూల్ సౌజన్యంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. మాజీమంత్రి పడాల అరుణ, ఉప్పలపాటి రమేశ్ రాజు, కర్రి నానాజీ, హర్షవర్ధన స్కూల్ కరస్పాండెంట్ ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే క్షయవ్యాధి అంతం



జామి: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారి భాగ్యరేఖ, వైద్య సిబ్బంది



బొండపల్లి: గొట్లాంలో వైద్య సిబ్బంది ర్యాలీ



కొత్తవలస: విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

జామి: అవగాహనతోనే క్షయ వ్యాధిని పూర్తిస్థాయిలో నిర్మూలించవచ్చని ఎస్.కోట టీబీ యూనిట్ క్షయ నివారణ అధికారి ఎస్.భాగ్యరేఖ అన్నారు. శుక్రవారం ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా మండలంలోని అట్టాడ గ్రామంలో బి.ఎస్.ఆర్ ఆశ్రమంలో క్షయవ్యాధిపై గురువారం అవగాహన కల్పించారు. అలాగే జామిలో పీహెచ్‌సీ వైద్యసిబ్బందితో ర్యాలీ నిర్వ హించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం,ఆకలి మందగించడం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే తక్షణమే కఫం పరీక్షలు చేయించుకోవాలన్నారు. వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. హెల్త్ ఎడ్యుకేటర్ అనిల్ ప్రేమ్‌కుమార్, వైద్య సిబ్బంది ఫ్లొరెన్స్, ఎస్.వి.భవానీ, సత్యనారాయణ, టీబీ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండండి

బొండపల్లి: క్షయవ్యాధిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని బొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం టీబీ యూనిట్ సూపర్ వైజర్ బి.రాము సూచించారు. గొట్లాం గ్రామంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణాంతక క్షయవ్యాధిపై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని అన్నారు. గొట్లాం హెల్త్ సూపర్‌వైజర్ బి.లక్ష్మి, హెల్త్ సహాయకులు బి.విశ్వేశ్వరరావు, ఎ.ఎన్.ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

టీబీ రహిత సమాజాన్ని నిర్మిద్దాం..

కొత్తవలస: అవగాహనతో టీబీ (క్షయ వ్యాధి) రహిత సమాజాన్ని నిర్మిద్దామని వియ్యంపేట పీహెచ్‌సీవైద్యాధికారి గోపాలకృష్ణ పిలుపునిచ్చారు. వియ్యంపేట అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల, రామలింగాపురం గ్రామాల్లో క్షయ వ్యాధి నిర్మూలనపై గురువారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్స్ రాము, సత్యారావు మాట్లాడుతూ టీబీ అంటువ్యాధని, ఒకరి నుంచి మరొక రికి దగ్గినప్పుడు,తుమ్మినప్పుడు తుంపర్ల ద్వారా వ్యాప్తి చెందుతుందన్నారు. దుమ్ము,ధూళి ప్రదేశాల్లో పనిచేసేవారికి,మద్యపానం,దూమపానం చేసేవారికి,రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి ఈవ్యాధి తొందరగా సోకుతుందన్నారు. వ్యాధి లక్షణాలు ఉన్నవారు తక్షణమే కఫం పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి ప్రభుత్వం ఉచితంగా మందులు అందజేస్తుందని, అలాగే పౌష్టికాహారం నిమిత్తం రోగి ఖాతాలో నెలకు రూ.500 చొప్పున ఆరు నెలల పాటు జమ చేస్తారని తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ టి.జయశ్రీ, హెచ్‌వీ పద్మావతి, ఎంపీహెచ్ఓ గోవిందరావు, పీహెచ్‌సీ సిబ్బంది గీతిక, శ్రీదేవి, భవాని, వరలక్ష్మి పాల్గొన్నారు.

భక్తి భావం

మండలంలోని జమ్ములో రామాలయం ప్రారంభోత్సవాన్ని ఆలయ కమిటీ నిర్వాహకులు, సర్పంచ్ గొర్లె నరసింహమూర్తి ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. సీతారాముల విగ్రహాలను పుర వీధుల్లో ఊరేగించారు. విగ్రహాలకు అభిషేకాలు చేశారు. రామాలయంలో మహిళలు పెద్ద ఎత్తున కుంకుమ పూజలు చేశారు. సీతారాముల విగ్రహాలను శుక్రవారం ప్రతిష్ఠించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

– గుర్ల



రామాలయంలో కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు